సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం : 26 : మార్చి : 2023



మారుజాతి కలప పట్టివేత

అడ్డతీగల: ట్రాక్టర్‌పై తరలిస్తున్న మారు జాతి కలపను స్వా. దీనం చేసుకున్నట్టు అటవీక్షేత్రాధికారి లలితకుమారి తెలిపారు. దీని విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు.



సమస్యలు పరిష్కరిస్తాం 8లో

మునుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సమస్యలను పరిష్కరిస్తామని టీడబ్ల్యూ డీడీ జాన్ రాజు తెలిపారు.



తక్షణ సాయమే లక్ష్యం 8లో

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయం అందించడమే ఆపదమిత్రల లక్ష్యమని, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు.

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:

ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6-09	4-41

రంపచోడవరం :

ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
6-25	4-44

అలల గోదారిపై.. రయ్ రయ్..!

ఉప్పొంగెలే గోదావరి, ఊగిందిలే చేలోవరి, భూదారిలో నీలాంబరి, మా సీమకే చీనాంబరి, వెతలు తీర్చే మా దేవేరి, వేదమంటి మా గోదారి, శబరి కలిసినా గోదారి, రామచరితకే పోదారి అంటూ గోదావరిపై సాగే పాపికొండల విహారం ఎంతో ఆహ్లాదం తోపాటు మరుపురాని మధురానుభూతినిస్తుంది. ప్రభుత్వం భద్రతతో కూడిన పటిష్ట చర్యలు చేపట్టడంతో హాయిగా సాగుతోంది.



పోచవరం బోటింగ్ పాయింట్‌లో లాంచీలు



లాంచీలో పాపికొండలు విహారం

- పాపికొండలు పర్యాటకానికి పెరుగుతున్న ఆదరణ
- భద్రత, పటిష్ట చర్యలు చేపట్టిన ప్రభుత్వం

చింతూరు: గోదావరి నదిలో తరచూ ప్రమాదాలు జరుగుతూ అనేకమంది ప్రాణాలు గంగమ్మ ఒడిలో కలసిపోయేవి. మంటూరు వద్ద జరిగిన ఫెర్రీ లాంచీ మునక ప్రమాదంలో 20 మంది వరకు గిరిజనులు మృత్యువాత పడగా కచ్చులూరు మందం వద్ద పర్యాటకులతో వెళ్తున్న లాంచీ నీటమునిగి 50 మందికి పైగా మృతిచెందారు. దీంతో సుమారు రెండేళ్లపాటు గోదావరి నదిలో లాంచీ ప్రయాణానికి బ్రేక్ పడింది. ప్రభుత్వం పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది తిరిగి గోదావరిలో పాపికొండల విహారానికి అనుమతినిచ్చింది. పటిష్టమైన చర్యలతో పాపికొండల ప్రయాణానికి భద్రత కల్పిస్తుండటంతో భారీగా పర్యాటకులు తరలివస్తున్నారు.

జిల్లాలో లాంచీ పర్యాటకం

జిల్లాలో దేవీపట్నం మండలం పోశమ్మగండి, వీఆర్‌పురం మండలం పోచవరంలో పర్యాటక లాంచీల పాయింట్లున్నాయి. పోశమ్మగండి నుంచి పేరంటాలపల్లికి 40 కిలోమీటర్లు దూరంకాగా రెండున్నర గంటల ప్రయాణం. ఇక్కడ ఏపీ టూరిజంకు చెందిన ఒక బోటు, 14 ప్రైవేటు బోట్లు ఉన్నాయి. అలాగే పోచవరం నుంచి కొల్లూరు వరకు 25 కిలోమీటర్ల దూరంకాగా మూడు గంటల ప్రయాణం. ఇక్కడ ఏపీ టూరిజంకు చెందిన ఒక బోటు, 11 ప్రైవేటు బోట్లు ఉన్నాయి.

సుడులు తిరిగే ప్రాంతాలివే..

గోదావరి నదిలో దేవీపట్నం, పాపికొండల నడుమ అత్యంత ప్రమాదకర ప్రాంతాలు ఉన్నాయని, ఈ ప్రాంతాల్లో గోదావరి ఎప్పుడూ సుడులు తిరుగుతూ ఉంటుందని సరంగులు అంటున్నారు.

- పశ్చిమ గోదావరి జిల్లా వైపు వాడపల్లి, తూర్పు గోదావరి జిల్లావైపున మంటూరు వద్ద నదిలో అధికంగా సుడిగుండాలుండగా కచ్చులూరు మందం వద్ద మాత్రం ఇవి అత్యంత ప్రమాదకర స్థితిలో వుంటాయని సరంగులు తెలిపారు. కొండలు దగ్గరగా ఉండటమే దీనికి ప్రధాన కారణమని వారు తెలిపారు. ప్రతి లాంచీలో లైఫ్ జాకెట్లతో పాటు లైఫ్‌బోయా, ఆక్సిజన్ సిలిండర్లు, ఫైర్ బకెట్లు ఉంటాయన్నారు. లాంచీకి ప్రమాదం సంభవించే సందర్భంలో లైఫ్‌బోయాలను నదిలోకి విసిరితే నదిలో మునిగిపోతున్న వారు వాటిని పట్టుకుని సురక్షిత ప్రాంతానికి చేరే అవకాశముంటుందని సరంగులు తెలిపారు.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా..

గోదావరి నదిలో ప్రమాదాల నివారణకు ప్రస్తుత ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టింది. ప్రయాణికులు, పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా రెవెన్యూ, పోలీసు, టూరిజం, ఇరిగేషన్ సిబ్బంది పర్యవేక్షణలో లాంచీ ప్రయాణం సాగేలా నిబంధనలు కఠినతరం చేసింది.

- ప్రయాణికులకు లైఫ్‌జాకెట్లు తప్పనిసరి చేయడంతో పాటు లైఫ్‌బోయాలు, ఫైర్ అలారం శాటిలైట్ ఫోను, వాకీటాకీలు ఏర్పాటుచేశారు.
- నిరంతర పర్యవేక్షణకు స్విమ్మర్‌తో కూడిన లైఫ్ బోటు ఏర్పాటు చేయడంతో పాటు శాటిలైట్ ఫోను ద్వారా కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. లాంచీల నాణ్యతను పరిశీలించేందుకు నిరంతరం ఫిట్‌నెస్ టెస్టులు చేపడుతున్నారు.

నిరంతరం పర్యవేక్షణ

ప్రమాదాల నివారణలో భాగంగా లాంచీలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నాం. ప్రైవేటు బోట్లు అన్ని నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకుల విహారానికి పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల తాత్కాలికంగా పాపికొండలు విహారం నిలిచిపోయింది. తగ్గిన వెంటనే పునరుద్ధరిస్తాం.

– **సిరిపురం రజిత్**, అసిస్టెంట్ మేనేజర్, ఏపీ టూరిజం, పోశమ్మగండి

ముగ్గురు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో వైద్య ఆరోగ్య కార్యక్రమాల అమలుకు సంబంధించి కలెక్టరేట్‌లో నిర్వహించిన కీలక సమావేశానికి ఆలస్యంగా హాజరైన ముగ్గురు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సుంకరమెట్ట,ఆర్‌వీ నగర్, భీమవరం పీహెచ్‌సీల వైద్యులు బుజ్జిబాబు, సౌమ్య,అనుప్ సమావేశానికి ఆలస్యంగా రావడంపై కలెక్టర్ ఆగ్రహానికి గురయ్యారు.

ఒడిశా బస్సుకు ప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

చింతూరు: మండలంలోని వాలమూరిగొంది వద్ద ఒడిశాకు చెందిన బస్సు శనివారం ప్రమాదానికి గురైంది. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి నుంచి భద్రాచలం వెళుతున్న క్రమంలో బస్సు అదుపుతప్పింది. రహదారి పక్కనే ఉన్న చెట్లలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 30 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. వీరిలో స్వల్పంగా గాయపడిన ముగ్గురిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

న్యూస్‌రీల్

ఏకలవ్యలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కొయ్యూరు: స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఐ.విఠల్ తెలిపారు. ఆరో తరగతిలో బాలురకు 30, బాలికలకు 30 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేయాలని కోరారు. ఏడో తరగతిలో ఆరు ఖాళీలున్నాయన్నారు. వాటికి కూడా దరఖాస్తు చేయాలని కోరారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుందన్నారు. అదే నెలలో అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రస్తుతానికి పాఠశాలను కొయ్యూరు గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటు



ఉత్సవ కమిటీ సభ్యులు

జి.మాడుగుల: శ్రీ మత్స్యమాడుగులమ్మతల్లి ఉత్సవ కమిటీ శనివారం ఏర్పాటైంది. అధ్యక్షుడుగా మత్స్యరాస రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా మత్స్యరాస నారాయణరాజు, గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రులు మత్స్యరాస బాలరాజు, మణికుమారితోపాటు మత్స్యరాస వరహాలరాజు, మాజీ ఎంపీపీ ఎం.వరహాలమ్మ, ఎం మత్స్యరాజు మాస్టారు, ఎం.రామరాజు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా వడ్డాది శ్రీనివాసరావు, వంతాల గణపతి, గోపాల్‌రాజు, సీహెచ్ వెంకటరమణ, అరుణ్‌కుమార్, తలారి సత్యనారాయణ, కార్యదర్శులుగా గిరధర్‌సాయి, గణపతి, గసాడి రెడ్డిబాబు, వరుణ్, వినోద్, గంగాధర్‌నాయుడు, కేవీ రమణ, కె సత్తిబాబు, కోశాధికారిగా కేవీవీ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యుడుగా ఉమా సత్తిబాబు, మరికొందరిని కమిటీ సభ్యులుగా నియమించారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



అనంతగిరిలో సైక్లిస్టులు నమ్మియాదవ్, సునీల్‌కుమార్

అనంతగిరి: సైక్లింగ్‌తోనే సంపూర్ణ ఆరోగ్యమని సైక్లిస్టులు నమ్మి యాదవ్, సునీల్‌కుమార్ అన్నారు. విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్ ప్రాంతానికి చెందిన వీరు సైక్లింగ్ చేసుకుంటూ శనివారం ఉదయం ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సైక్లింగ్‌పై దృష్టిసారించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఫ్రెంచ్‌లో జరగనున్న 1200 కిలోమీటర్ల సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటునట్లుగా తెలిపారు. మరిన్ని అంతర్జాతీయ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని, దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తేవాలన్నదే లక్ష్యమని వారు పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక ఆసరా లక్ష్యం



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 8,471 పొదుపు సంఘాల ఖాతాల్లో రూ.33.46 కోట్లు జమ
- వైఎస్సార్ ఆసరాలో 83,291 మంది సభ్యులకు లబ్ధి

సాక్షి,పాడేరు: మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మూడవ విడతలో వైఎస్సార్ ఆసరా పథకం ఆర్థిక సాయాన్ని పొదుపు సంఘాల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశమందిరంలో వీడియో ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకంలో జిల్లాలోని 8,471 పొదుపు సంఘాలకు చెందిన 83,291మంది డ్వాక్రా మహిళలకు రూ.33కోట్ల 46లక్షల 60వేలు ప్రభుత్వం జమచేసిందని పేర్కొన్నారు. జిల్లాలోని పొదుపు సంఘాలకు నమూనా చెక్కును ఆయనతోపాటు, విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతి రాణి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటితో వ్యాపారం, పరిశ్రమలు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళా సాధికారత మరింత మెరుగుపడుతుందన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుజేస్తున్న వైఎస్సార్ ఆసరా ఎంతో దోహద పడుతుందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.రాష్ట్ర జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేకంగా జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు గిరిజనుల సంక్షేమానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డీఆర్‌డీఏ పీడీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పడవ రేవు వేలం రూ.36.30 లక్షలకు ఖరారు



పడవ రేవు వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కూనవరం:కూనవరం- రుద్రమకోట మధ్య గోదావరి రేవులో పడవ నడిపేందుకు శనివారం స్థానిక గ్రామ పంచాయతీలో సర్పంచ్ కట్టం రాజమ్మ అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహించారు. వీఆర్‌పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన పూనెం ప్రదీప్(కిరణ్)కు రూ.36.30 లక్షలకు ఖరారైంది. మొత్తం 8 మంది వేలం పాటలో పాల్గొన్నారు. కాగా పెచ్చు పాట దారుడైన పూనె పూనెం ప్రదీప్‌కు ఖరారైంది. ఈకార్యక్రమంలో డీఎల్పీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో ఫణీంద్ర, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, రుద్రమకోట సర్పంచ్ ఎన్.స్వర్ణలత, కార్యదర్శి కె.రవి, స్థానిక ఈవోపీఆర్డీ సురేష్, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం ఆస్పత్రిలో బాలింత మృతి



మృతి చెందిన బాలింత సీత

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ లోయలపాలెంకు చెందిన బాలింత విప్పల సీత(34) శనివారం సాయంత్రం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మృతి చెందింది. సీతకు పురిటి నొప్పులు రావడంతో రాజేంద్రపాలెం ఆస్పత్రి నుంచి శనివారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె గర్భంలో ఇద్దరు శిశువులు ఉన్నారు. ముందు మగశిశువుకు జన్మనిచ్చింది. రెండో శిశువును ప్రసవిస్తుండగా ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తి మృతి చెందినట్టు ఆమె భర్త రాజారావు తెలిపారు. ఆమెకు ఇది ఐదో కాన్పు. సీత మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు రోదించారు.

ముగ్గురు విద్యార్థులు డిబార్

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా జరుగుతున్న ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు శనివారం మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా పట్టుబడ్డారు. వీరిని రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డిబార్ చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ విజయమోహనరావు తెలిపారు.

అసిస్టెంట్ కలెక్టర్ సీహెచ్‌సీ సందర్శన



ముంచంగిపుట్టులో బర్త్ వెయింటింగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ

ముంచంగిపుట్టు: స్థానిక సీహెచ్‌సీని అసిస్టెంట్ కలెక్టర్ అస్తోష్ శ్రీవాస్తవ శనివారం సందర్శించారు. వైద్యసేవల వివరాలను రోగులనుంచి తెలుసుకున్నారు. అనంతరం మందుల నిల్వ గది, ఎస్ఎన్‌సీయూను తనిఖీ చేశారు. పుట్టిన పిల్లలకు అందిస్తున్న వైద్యం ,సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వైద్యాధికారిణి మౌనిక నుంచి తెలుసుకున్నారు. బాలింతల నుంచి వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. బర్త్ వెయింటింగ్ రూమ్‌ను పరిశీలించారు. గైనికాలిజిస్ట్ లేక గర్భిణులు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలో పూర్తిస్థాయిలో వైద్యులను ప్రభుత్వం నియమిస్తుందని, రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈనంతరం స్థానిక రెవెన్యూ కార్యలయాన్ని సందర్శించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ సర్వే వివరాలు తెలుసుకున్నారు. సర్వేకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ నర్సమ్మనుంచి తెలుసుకున్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు



నిందితుడు రాకేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది

సీలేరు: గంజాయి రవాణా కేసులో ఏడాదిగా పరారీలో ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితుడు రాకేష్‌కుమార్‌ను జీకే వీధి పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి జీకే వీధి సీఐ అశోక్‌కుమార్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. మారుమూల ప్రాంతాల నుంచి గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలించడంలో అంతర రాష్ట్ర ముద్దాయిలు అయిన అజయ్ (ఒడిశా), విపున్ కుమార్, రాకేష్ కుమార్(యూపీ) సిద్ధహస్తులు. ఏడాది క్రితం వీరు ముగ్గురు ఒడిశా నుంచి 80 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా అజయ్, విపున్‌కుమార్ పట్టుబడ్డారు. అప్పట్లో రాకేష్‌కుమార్ తప్పించుకున్నాడు. ఎట్టకేలకు అతనిని పట్టుకున్న సీఐ అశోక్ కుమార్, కానిస్టేబుల్ శ్రీను, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకుమార్ అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్యమే లక్ష్యం

- వైద్యులు బాధ్యతగా విధులు
- నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, రోగులకు బాధ్యతగా వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ పరిధిలోని 35ఆరోగ్య కేంద్రాల వైద్యులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల స్క్రీనింగ్‌లు సక్రమంగా నిర్వహించి, పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీల వైద్యులు క్రమం తప్పకుండా ఉప ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, ఏఎన్ఎంలు,ఆశాలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలని, అన్ని రకాల టీకాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి సుఖప్రసవాలకు ముందస్తుగానే ప్రణాళిక ప్రకారం బర్త్‌వెయిటింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. రవాణా సౌకర్యాలను కల్పించాలన్నారు.జనన రిజిస్టర్‌లో పిల్లల వివరాలు నమోదు చేయాలని, అవసరమైతే పీహెచ్‌సీల పరిధిలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.గర్భిణుల వివరాలు జననీ సురక్ష యోజనలో అప్‌లోడ్ చేసి, ప్రసవానంతరం వారికి పారితోషకం అందజేయాలన్నారు. ప్రతి రెండు వారాలకు సమీక్ష జరుపుతామని, వచ్చే సమావేశం నాటికి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు


బేసుకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ గున్నమామిడి గ్రామానికి చెందిన పాంగి బేసు శనివారం చింతపండు సేకరణకు చెట్టు ఎక్కి అదుపుతప్పి ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయలయ్యాయి. గాయపడిన బేసును కుటుంబ సభ్యులు, స్థానికుడు సింహాచలం తదితరులు హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి ప్రైవేట్ వాహనంలో తరలించారు.

జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జగన్మోహన్‌రావు

పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో 50 చోట్ల మే ఒకటి నుంచి 31 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహన్‌రావు తెలిపారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన క్రీడా అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, స్కూల్ గేమ్స్ పెడరేషన్స్, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఈనెల 31వతేదీ లోగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9000274225 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు భాగవతంపై చాగంటి ప్రవచనం

అనకాపల్లి టౌన్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు 'భాగవతం' అనే అంశంపై ప్రవచనం చేస్తారని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు మొదలవుతుందని పేర్కొన్నారు.

గిరి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గిరిజన విద్యార్థుల మరణాలు తీవ్ర అవేదన కలిగిస్తున్నాయన్నారు. జువైనల్ జస్టిస్ ఆదేశాల మేరకే పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ అమలు, భద్రత చర్యలు, విద్య, వైద్య సేవలపై ఐటీడీఏలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రతి నెల 20 నుంచి 25 తేదీల మధ్య ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రుల్లో స్టూడెంట్ హెల్త్ సెల్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సికిల్‌సెల్ ఎనీమియాను గుర్తించేందుకు 54,730 మంది విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు చేసినట్టు పీవో తెలిపారు. వీరిలో 15 మంది విద్యార్థులు సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నట్టు నిర్ధారించామన్నారు. వీరికి మెరుగైన వైద్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. విద్యార్థులను సంరక్షించాల్సిన బాధ్యత సంబంధిత పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్లపై ఉందన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, ఏటీడబ్ల్యూవోలు రజని, కూడా వెంకటరమణ, క్రాంతికుమార్, మల్లికార్జున, నాగజయలక్ష్మి, ఉపాధ్యా, విద్యార్థి సంఘాల నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

దేవీపట్నం: ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సమస్యలను పరిష్కరిస్తామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ జాన్ రాజు తెలిపారు. శనివారం ఆయన వసతిగృహంలో విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. వసతిగృహంలో ఇటీవల అనారోగ్యం కారణంగా వరుసగా ఇద్దరు విద్యార్థినులు మృతిచెందడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై కొందరు పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. అన్ని గ్రామాలు సమీపంలో ఉండడంతో కేవలం ప్రతిరోజు పాఠశాలకు మాత్రమే వచ్చి అనంతరం ఇళ్లకు వెళ్లి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తల్లిదండ్రులతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వసతిగృహం ప్రహరీ ఎత్తు పెంచాలని, రెగ్యులర్‌గా నర్సును ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను కలిసేందుకు నిబంధనలు సడలించాలని తల్లిదండ్రులు విన్నవించారు. వీటన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని , పిల్లలను వసతి గృహానికి పంపించాలని డీడీ కోరారు. ఏటీడబ్ల్యూవో రామతులసి తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయమే లక్ష్యం

రంపచోడవరం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయం అందించడమే ఆపద మిత్రల లక్ష్యమని, అదే సంకల్పంతో వారిని ప్రభుత్వం ఏర్పాటుచేసిందని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. స్థానిక వైటీసీలో 11 మండలాలకు సంబంధించిన వంద మంది వలంటీర్లకు చేపట్టిన ఆపదమిత్ర శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేపట్టే సహాయక చర్యలపై శిక్షణ ఇచ్చామన్నారు. వీరంతా గ్రామంలో 20 మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఊహించని సంఘటనలు నెలకొన్న సందర్భంలో తక్షణ సాయం అందించే బాధ్యత ఆపద మిత్రలపై ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆపద మిత్రలకు గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లు , ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు అవసరమైన కిట్లను పీవో అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీవో కె.కోటేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూషా, డీఎంఎంలు పి. వెంకటేశ్వరరావు, డీపీఎం కిరణ్మయి, వైటీసీ మేనేజర్ సుదీప్‌లు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజన యువత కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఇచ్చే శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. కెవీకెలో అలంకరణ చేపల పెంపకం, అక్వేరియం తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని పీవో శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే శిక్షణలో అన్ని విషయాలు నేర్చుకుని, స్వయం ఉపాధి పొందాలన్నారు. ఐటీడీఏ తరఫున పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. గిరిజన యువత విలువ ఆధారిత ఉత్పత్తుల మార్కెట్ చేసుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. అలంకరణ చేపల ఉత్పత్తి, అక్వేరియం తయారీ పూర్తిగా నేర్చుకోవాలన్నారు. యువత డిగ్రీ వరకు పూర్తి చేసిన తరువాత ఇలాంటి శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కెవీకె శాస్త్రవేత్త వీరాంజనేయులు మాట్లాడూ జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సహకారంతో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

సోలార్ వీధి దీపాలు ప్రారంభం


సోలార్ వీధి దీపాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ సుభద్ర

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో చాలాకాలం తరువాత సోలార్ వెలుగులు వచ్చాయి.అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తన ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.3.20లక్షలను ఇందుకోసం కేటాయించారు. మండల కేంద్రంలో రెండు ప్రాంతాల్లో వీటిని అమర్చారు. వీటిని శనివారం ఎంపీపీ బోయినకుమారి, సర్పంచ్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ నాయకులు అరుణ్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టులో స్థానికులకు అవకాశం కల్పించాలి


జేఏసీ నూతన కార్యవర్గం

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరులో నూతనంగా నిర్మించనున్న పంపు స్టోరేజ్ ప్రాజెక్టులో స్థానికులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి ఏప్రిల్ 1వతేదీన ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించేందుకు తేదీని అధికారులు ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సీలేరు గ్రామస్తులు, పలు పార్టీల నేతలు, వ్యాపారస్తులతో గ్రామసభ నిర్వహించి స్థానికుల డిమాండ్ల ప్రకటించారు. ప్రాజెక్టు ప్రారంభంలో ఉద్యోగాలు, ఇళ్లు కోల్పోయిన వారికి గృహాలు, వైద్యసదుపాయం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రతి పార్టీ నుంచి, వర్తకసంఘం, గ్రామపెద్దల నుంచి ఇద్దరు చొప్పున జేఏసీ సభ్యులుగా ఏర్పడ్డారు. సర్పంచ్ వల్లీ ప్రసాద్, ఎంపీటీసీ సాంబమూర్తి, ఇతర నేతల ఆధ్వర్యంలో ప్రతినిధులను ఎన్నుకున్నారు.

వారపు సంతల్లో మోసాలకు అడ్డుకట్ట

- వ్యవసాయశాఖ జేడీ నందకుమార్

హుకుంపేట: గిరిజన రైతులు పండించిన సరకులు విక్రయాల్లో మోసాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ జేడీ నందకుమార్ తెలిపారు. శనివారం ఆయన హుకుంపేట వారపు సంతలో వ్యాపారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారపు సంతలో దళారుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. రైతులు తీసుకొచ్చిన సరుకులు ఒకే చోట కొనుగోలు చేయాలని ఆదేశించారు. అప్పుడే సరుకుల అసలు ధరలు తెలుస్తాయని, దీని మూలంగా దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. దీనిపై ప్రధానంగా దృష్టి సారించి గిరి రైతులకు మెరుగైన మార్కెటింగ్, గిట్టుబాటు ధర కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బైక్ ఢీకొని 8 మందికి గాయాలు


అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ నానాజీ భార్య దుర్గ

కశింకోట: మండలంలోని జి. భీమవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ముగ్గుర్ని విశాఖ కేజీహెచ్‌తోపాటు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. నర్సీపట్నం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఆటో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొన్నాయి. బైక్ నడుపుతున్న మాకవరపాలెం మండలం పైడిపాలకు చెందిన కె. రాజేష్, తాళ్లపాలెం వద్ద లిఫ్టు అడిగి బైక్ వెనుక కూర్చున్న జి. భీమవరానికి చెందిన అల్లం సతీష్, ఆటోలో ప్రయాణిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన డి.గంగ, ఆటో డ్రైవర్ ఒ.నానాజీ, అతడి భార్య దుర్గ, కుమారుడు భానుచంద్ర, కుమార్తె ఉమాదేవి, కన్నూరుపాలెం గ్రామానికి చెందిన ప్రయాణికులు ఎ.కుమారి, రామలక్ష్మి గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో స్థానికుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను కేజీహెచ్‌కు, సతీష్, గంగలను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.